ఆశీర్వదించమ్మా.. ఆదిపరాశక్తి

సాక్షి,నెట్‌వర్క్ : శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దినిదేవి అలంకారంలో భక్తులకు కరుణాకటాక్షలు అందించారు. రాజంపేటలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, సంబేపల్లె నల్లగంగమ్మ ఆలయంలో హోమ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనాల కోసం ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రధాన వీధులలో షాపింగ్ చేసేవారితో నిండిపోయింది. పండుగ సరుకులు కొనేందుకు వచ్చిన మహిళలు, చిన్నారులతో మార్కెట్‌లో కోలాహల వాతావరణం కనిపించింది.


రాజంపేట టౌన్: అమ్మవారిశాలలోని అద్దాల మండపంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు


రాజంపేట టౌన్: మహిషాసురమర్దినిగా మారెమ్మ


రాయచోటి టౌన్: దుర్గా దేవిగా కన్యకాంబ


రాయచోటి టౌన్: దుర్గా దేవిగా చౌడేశ్వరి


చిన్నమండెం: దుర్గాదేవిగా వాసవీమాత


సంబేపల్లె: నల్లగంగమ్మ ఆలయంలో జరిగిన హోమ కార్యక్రమంలో భక్తులు


నందలూరులో మహిషాసురమర్దినిగా వాసవీమాత


పెనగలూరు: ప్రత్యేక అలంకారంలో కామాక్షమ్మ


రామాపురం: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


సిద్దవటం: దుర్గా దేవిగా గంగా భవాని


పుల్లంపేట: దుర్గాదేవి అలంకారంలో మారెమ్మ

విజయదశమి శుభాకాంక్షలు



రాయచోటి : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. దుష్ట శిక్షణ, సిష్ట రక్షణతో ఆదిపరాశక్తిగా నిలిచిన దుర్గమ్మ ప్రజలకు సద స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అమ్మవారు మహిషాసురుని అంతమొందించింది విజయదశమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలని, ప్రజలకు ప్రగతి ఫలాలు అందాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

బెటాలియన్‌లో మూవీ ప్రోగ్రాం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్‌పీ 11 వ బెటాలియన్‌లో సిబ్బంది, అధికారులకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుల ఘనత, వారి ప్రాణత్యాగాలకు సంబంధించి చిత్ర ప్రదర్శన(మూవీ)ను ఏర్పాటు చేశారు. కమాండెంటు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బెటాలియన్‌లోని లెక్చరర్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రదర్శించారు.

వీరచౌడేశ్వరికి వెండి కిరీటం బహూకరణ

రాజంపేట టౌన్ : పట్టణానికి చెందిన దండే సుబ్రమణ్యం, వనజ దంపతులు వీరచౌడేశ్వరి దేవి ఆలయంలో కొలువైన చౌడేశ్వరికి రూ.1.6 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆదివారం రాత్రి కిరీటాన్ని తొగటవీరక్షత్రీయ సంఘం అధ్యక్షుడు ఉప్పు రామచంద్రకు అందజేశారు.

ఇరుగులమ్మకు పూజలు

గాలివీడు : మండలంలోని గోపనపల్లె గ్రామంలోని ఆవుల ఇరుగులమ్మకు దసరా నవరాత్రులను పురష్కరించుకొని పండితులు నాగఫణి కిశోర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అణగారిన వర్గాల ఆశాదీపం ఎస్ఆర్ శంకరన్

రాయచోటి అర్బన్ : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్పవ్యక్తి ఎస్.ఆర్. శంకరన్ అని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో ఒకే లైన్ పరిపాలన కోసం, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశాడన్నారు. ఆర్థికంగా బలహీనవర్గాల ప్రజలకు తగినంత బడ్జెట్ వనరులను అందించడానికి ప్రత్యేక కాంపోనెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్‌ప్లాన్‌లను ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించాడన్నారు. ఇవేకాక దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేసిన శంకరన్‌కు బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎంతో రుణపడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, డీహెచ్‌పీఎస్ నేతలు హరి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, మహిళా సంఘం నేత మస్రి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

'జయంతి' స్టాపింగ్‌పై హర్షం

ఓబులవారిపల్లె : రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ రైల్వేకేంద్రంలో పూణె కన్యాకుమారి జయంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించినట్లు ఉత్తర్వులు జారీ చేయడంపై గుంతకల్ డీఆర్‌సీసీయూ మెంబర్ టి.భరత్‌కుమార్ రెడ్డి రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మంగంపేట కాపుపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కల్పించాలని ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వే మంత్రి వైష్ణవ్‌ను విన్నవించారన్నారు. స్పందించిన రైల్వే శాఖ జయంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించినట్టు పేర్కొన్నారు. తాను కూడా ఈ విషయమై ఇటీవల గుంతకల్ డీఆర్‌సీసీయూ సమావేశంలో రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై రాజంపేట ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీపీ మేడా


పూజల్లో పాల్గొన్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. పూజల్లో మహిళలు, చిన్నారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డీఏ పెంపుపై హర్షాతిరేకం

రాయచోటి టౌన్ : దసరా కానుకగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం డీఏ పెంచడంపై పీఎస్‌టీయూ సంఘం రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మజహరుల్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పండుగ కానుకగా డీఏను పెంచడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్వరులు జారీ చేయడం మరింత సంతోష తగ్గవిషయమన్నారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ జీవోతో ప్రభుత్వంలోని 177 శాఖలలో జూన్2వ తేదీ 2014 సంవత్సరం నాటికి చేరినవారి సంఖ్య 10 వేల మంది ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్రియా బాషాలు ఉన్నారు.

నేడు వైభవంగా గుండప్రవేశం

రాజంపేట టౌన్ : దేవీ నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారిశాల ప్రధాన ముఖ ద్వారం వద్ద గుండప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత వాసవీమాత ప్రతిమను పురవీధుల్లో ఊరేగించి అనంతరం గుండప్రవేశం చేయించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు పెద్దఎత్తున గుండం తొక్కనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నూర్‌బాషాల సింహగర్జనను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటి అర్బన్ : గుంటూరులో ఈ నెల 29న జరిగే నూర్‌బాషాల సింహగర్జన సభను విజయవంతం చేయాలని నూర్‌బాషా, దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. ఇమామ్‌లు, రాయచోటి నేతలు జి.ఖాదర్‌బాషా, జి.మస్తాన్‌వలిలు పిలుపునిచ్చారు. ఆదివారం మాసాపేటలో నూర్‌బాషా సంఘం సమావేశంలో సింహగర్జన సభ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 4 శాతం జనాభా ఉన్న నూర్‌బాషాలను పాలకులు ఓటుబ్యాంకుగా చూస్తున్నారే తప్ప ఎలాంటి ప్రాధాన్యత కల్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులస్తులకు ఏ రాజకీయ పార్టీ అయితే చట్టసభల సీట్లు కేటాయిస్తారో ఆపార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ షఫీ, పక్కీర్ సాహెబ్ పాల్గొన్నారు.